క్లుప్తంగా

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించిన కార్మికులు

గుంతకల్లుటౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల డిమాండ్లను పరిష్కరించేంత వరకూ సమ్మె కొనసాగిస్తామని కార్మిక జేఏసీ ఉపాధ్యక్షుడు మస్తాన్, సంయుక్త కార్యదర్శి సురేంద్ర తెలిపారు. ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టారు. సోమవారం మున్సిపల్ ఆఫీసు ఎదుట దీక్ష చేపట్టారు. కార్మికులను పర్మినెంట్ చేయాలని, అప్పటి వరకూ కనీస వేతనం కింద నెలకు రూ.29,200 చెల్లించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. దీక్షలో జేఏసీ నాయకులు కన్వీనర్ లక్ష్మీనారాయణ, కోకన్వీనర్ సుంకన్న తదితరులు పాల్గొన్నారు. వారి సమ్మెకు సీపీఎం నాయకులు మద్దతు తెలిపారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి మారుతి డిమాండ్ చేశారు.

ఆర్థిక సాయం అందజేత



బాధితుడికి నగదు అందజేస్తున్న భూమిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

పుట్లూరు: భూమిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు గురువారం గొర్రెల కాపరికి ఆర్థికసాయం చేసి ఆదుకున్నారు. వివరాలు.. మండల కేంద్రం సమీపంలోని చెరువుకట్ట వద్ద ఈ నెల 13న కుక్కల దాడిలో 37 గొర్రెలు మృతి చెందిన విషయం విదితమే. గొర్రెలు మృతి చెందటంతో కాపరి శ్రీనివాసులు ఆర్థికంగా ఇబ్బందులకు గురయ్యాడు. దీంతో బాధితుడికి భూమిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు బి.వాసుదేవరెడ్డి, బి. పెద్ద నారయణరెడ్డి సోమవారం రూ.55వేలు నగదు అందజేశారు.

సర్పంచ్‌కు పితృవియోగం



తిప్పన్న(ఫైల్)

బుక్కరాయసముద్రం: వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం శింగనమల నియోజకవర్గ అధ్యక్షురాలు, బీకేఎస్ సర్పంచ్ పార్వతి తండ్రి తిప్పన్న సోమవారం తెల్లవారుజామున ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న సంగతి తెలిసిందే. మండలంలోని పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు తిప్పన్న మృత దేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

శ్యామ్‌ప్రసాద్‌కు నివాళి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఇల్లూరు లక్ష్మీనారాయణ భవన్‌లో సోమవారం శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ 72వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు వడ్డే రమేష్, నాయకులు హరిహరనాథ్, కొలిమి రామాంజి, విశ్వనాథ్, మహేష్, నారాయణరెడ్డి, శ్రీనివాసులు, శ్రీరాములు, క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ : పట్టణంలోని టైలర్స్ కాలనీలో సోమవారం జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి బీజేపీ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ గంగాధర్, పట్టణ, రూరల్ అధ్యక్షులు కృష్ణమోహన్‌రాజు, శేషానందరెడ్డి, భీమలింగేశ్వరరెడ్డి, బూత్ కమిటీ సభ్యులు శంకర్, చెన్నకేశవరెడ్డి, ముత్తయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

యువకుల శ్రమదానం



కంపచెట్లను తొలగిస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీప క్రైస్తవ శ్మశాన వాటికలో సోమవారం యువత శ్రమదానం చేశారు. బుజ్జిబాబు ఆధ్వర్యంలో యువత శ్మశాన వాటికలోని కంపచెట్ల తొలగించారు. ప్రవేశద్వారం పొడవునా స్థానిక బీసీసీ రోడ్డుకు పొడవునా వెలసిన కంపచెట్లను తొలగించారు. ఇందుకు యువతకు క్రైస్తవ సోదరులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

‘ఫీజుల దోపిడీ అరికట్టాలి’

గార్లదిన్నె: ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు.సోమవారం వారు మాట్లాడుతూ ప్రైవేట్ విద్యా సంస్థలు పుస్తకాలు, అడ్మిషన్ ఫీజు అంటూ అధికంగా వసూలు చేస్తున్నాయని, విద్యాశాఖ అధికారులు స్పందించి అధిక ఫీజులను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కుళ్లాయప్ప, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ దొంగలు..!



- తాడిపత్రిలో వరుస చోరీలు
- భయాందోళనల్లో ప్రజలు



తాడిపత్రి రూరల్: పట్టణ, రూరల్ ప్రాంతాల్లో వరుస చోరీలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రెండు రోజుల వ్యవధిలో యల్లనూరు రోడ్డు, కొత్త మునిసిపాలిటీ కార్యాలయం వద్ద మహిళల మెడల్లోని బంగారు గొలుసులను అపహరించడం సంచలనం రేపుతోంది. దుండగులు వరుస దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు చాలెంజ్‌గా మారుతున్నారు. ఈ ఏడాది జనవరి 1న పట్టణంలోని గాజులక్రిష్ణ వీధిలో ఇంటి ముందర ముగ్గు వేస్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసును మోటర్ సైకిల్‌పై వచ్చిన దుండగులు అపహరించుకువెళ్లారు. కడపరోడ్డులోని సాయినగర్‌లోని కుళ్లాయిరెడ్డి ఇంటిలోకి దుండగులు విలువైన వస్తువులను అపహరించారు. గతంలో పట్టణంలోని శ్రీనివాసపురంలోని ఉపాధ్యాయులు వెంకటరామిరెడ్డి, భార్య శశికళ డ్యూటీకి వెళ్లిన సమయంలో ఇంట్లో ఆరు తులాల బంగారం చోరీకి గురైంది. ఈ సంఘటన మరుకమునుపే మరో మూడు ఇళ్లల్లో చోరీ జరిగింది.

రికవరీలు ఏవీ

తాడిపత్రి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో ఇప్పటి వరకు జరిగి దొంగతనాలకు సంబంధించిన రికవరీలు పూర్తిస్థాయిలో లేకపోవడంపై బాధితుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కేవలం దొంగతనాల సమయంలో హడావుడి చేసే పోలీసులు తదనంతరం పట్టించుకోవడం లేదు. దొంగతనాల రికవరీపై దృష్టి పెడితే దొంగలను అరెస్టు చేయడంతో పాటు భవిష్యత్తులో దొంగతనాలు జరుగకుండా నియంత్రించడానికి వీలవుతుంది. కానీ పోలీసు అధికారులు అటువైపు ఆలోచించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దొంగతనాలు జరుగకుండా అధికారులు ప్రచార మార్గాల ద్వారా సూచనలు, సలహాలు ఇస్తున్నారే తప్ప అందుకు కారణమవుతున్న దొంగలపై నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది. పోలీసుల నిఘా వైఫల్యం దొంగలకు వరంగా మారుతోంది. గతంలో దొంగతనాల నివారణ కోసం ఇళ్లు, వ్యాపార దుకాణాలకు చెందిన యజమానులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు బిగించుకోవాలని పోలీసులు కోరారు. కానీ సీసీ కెమెరాలను బిగించుకోవడంలో నిర్లక్ష్యం కూడా దొంగతనాలకు కారణమవుతోంది.

పోలీసులకు పనిభారం..

గతంలో దొంగతనాల నివారణ కోసం పోలీసు స్టేషన్‌లోని కొందరు పోలీసులతో స్పెషల్ పార్టీ, క్రైం పార్టీల పేరుతో నియమించేవారు. వారు నిరంతరం దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టడం జరిగేది. వివిధ దొంగతనాలతో సంబంధం ఉన్న పాత నేరస్తులతో పాటు పలు జైళ్లల్లో రిమాండ్‌లో ఉన్న దొంగల వద్దకు వెళ్లి వారి నుంచి దొంగల వివరాలను సేకరించేవారు. వారు ఇచ్చిన సమాచారంతో పలువురిని అరెస్టు చేసి బంగారు నగలు, విలువైన వస్తువులు, నగదును రికవరీ చేసేవారు. ప్రస్తుతం పోలీసు స్టేషన్లల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసులకు డ్యూటీల భారం ఎక్కువగా ఉండటం వల్ల కూడా దొంగతనాల రికవరీలపై దృష్టి పెట్టలేని పరిస్థితులు ఉన్నాయన్న ప్రచారం ఉంది. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పోలీసులకు వారంలో ఒక రోజు వీక్లీ ఆఫ్‌లు ఉండేవి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వీక్లీ ఆఫ్‌లను పట్టించుకోకుండా ఏదో ఒక బందోబస్తు పేరుతో పోలీసులను ఉపయోగించుకోవడం వల్ల పనిభారం పెరిగి దొంగతనాలపై దృష్టి పెట్టలేకపోతున్నారు.

మహిళలకు సూచనలు

తాడిపత్రి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో జరుగుతున్న దొంగతనాలను దృష్టిలో ఉంచుకొని రూరల్ పోలీసులు నిఘా పెంచారు. యల్లనూరు రోడ్డులో సోమవారం సాయంత్రం వాకింగ్‌కు వెళ్లిన పలువురు మహిళలకు పట్టణ సీఐ సాయిప్రసాద్, సిబ్బంది కలిసి చైన్ స్నాచింగ్‌లపై సూచనలు, సలహాలు ఇచ్చారు. పలు ప్రాంతాల్లో అనుమానస్పదంగా ఉన్న యువకులతో మాట్లాడి వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



పట్టణంలో దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో జన సంచారం లేని ప్రాంతాలు, ఇరుకుసందుల్లో ఒంటరిగా వాక్ చేయకూడదు. అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు అందించాలి. ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కే సమయంలో రద్దీ ఉంటే సెల్‌ఫోన్లను జాగ్రత్తగా చూసుకోవాలి. అలాగే బస్సుల్లో ప్రయాణించేటప్పుడు మహిళలు బంగారు నగల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

– సాయిప్రసాద్, పట్టణ సీఐ

దేవాలయంలో చోరీ

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని తోళ్ల షాపు కాలనీలో సోమ వారం తెల్లవారుజామున చోరీ జరిగింది. దొంగలు రాజేశ్వరి దేవాలయం తలుపులు పగల గొట్టి లోపలికి ప్రవేశించి హుండీలో ఉన్న సుమారు రూ.10 వేలు అపహరించారు. ఘటనపై ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



చోరీ జరిగిన గుత్తిలోని రాజేశ్వరి ఆలయం

ఏపీఓగా భాగ్యలక్ష్మి



శింగనమల: శింగనమల మండల ఏపీఓగా భాగ్యలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏపీఓగా పని చేస్తున్న శ్రీదేవి కణేకల్లుకు బదిలీ అయ్యారు. ఆ తరువాత ఇన్‌చార్జ్‌గా ఈసీ దామోదం పని చేశారు. ఏపీఓగా బాధ్యతలు చేపట్టిన భాగ్యలక్ష్మి బొమ్మనహాల్ మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు అందుబాటులో ఉంటామన్నారు.

బాధ్యతల స్వీకరణ

యల్లనూరు: మండల ఏపీఓగా ఓబిరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో కుందుర్పి ఏపీఓగా విధులు నిర్వహిస్తున్న ఏపీఓను జిల్లా ఉన్నతాధికారులు యల్లనూరు ఏపీఓగా బదిలీ చేశారు. ఓబిరెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు అందుబాటులో ఉంటూ సమస్యలు లేకుండా న్యాయం చేస్తామన్నారు.

ఇన్‌చార్జ్ ఏఓగా మధుకుమార్

యల్లనూరు: మండల వ్యవసాయాధికారిగా సోమవారం మధుకుమార్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న వ్యవసాయ అధికారి రామకృష్ణ ఉరవకొండకు బదిలీ అవడంతో తాడిపత్రిలో ఏఓగా పనిచేస్తున్న మధుకుమార్‌కు యల్లనూరు ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారిగా బాధ్యతలను అప్పగించారు.

పోరాట యోధుడు రామిరెడ్డి



రామిరెడ్డి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ

పెద్దపప్పూరు: రామిరెడ్డి అలుపెరగని పోరాట యోధుడని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ అన్నారు. సోమవారం పెద్దవడుగూరులో సీపీఐ నాయకుడు రామిరెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన మంగళవారం రామిరెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ తరుపున ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వెంకటరాముడు యాదవ్, నాయకులు సూర్యనారాయణ రెడ్డి, నారాయణ, లింగన్న, రంగనాయకులు, హుసేన్‌పీరా, రామయ్య, సుధాకర్ గౌడ్, ఓంనారాయణ, శ్రీనివాస రెడ్డి, గొడ్డలి రాముడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నార్పల: రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని బొందలవాడ గ్రామ శివారులో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. మండలంలోని బొందలవాడకు చెందిన నాగభూషణం(40) వ్యక్తిగత పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చి తిరిగి గ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో బత్తలపల్లి నుంచి తాడిపత్రి వైపు వెళ్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంలో వస్తూ ఢీ కొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ నాగభూషణం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సాగర్ తెలిపారు.

అరాచకాలు ఆపి.. అభివృద్ధి చేయండి



మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ జింకల రామాంజనేయులు

గుంతకల్లుటౌన్: అరాచకాలు, దౌర్జన్యాలు ఆపి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి పాటుపడాలని మున్సిపల్ మాజీ చైర్మన్, ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ జింకల రామాంజనేయులు తదితరులు ఎమ్మెల్యే జయరామ్, ఆ పార్టీ నేతలకు హితవు పలికారు. మాజీ సీఎం వైఎస్.జగన్, మాజీ ఎమ్మెల్యే వైవీఆర్ పట్ల స్థానిక టీడీపీ నాయకులు చేసిన వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ నేతలు ఘాటుగా స్పందించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రామాంజనేయులు మాట్లాడుతూ ఆలూరు ప్రజలు తోక కట్ చేసి సున్నం పెట్టి ఇక్కడ పంపినా మీరు మారకుండా రాజ్యాంగ విరుద్ధంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. 1995లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీలో ఉన్న తమను నామినేషన్లు వేయొద్దని స్వయానా పరిటాల రవినే ఇక్కడికి వచ్చి బెదిరించినా.. భయపడకుండా దివంగత మాజీ ఎమ్మెల్యే గాది లింగప్ప నేతృత్వంలో ఇండిపెండెంట్ అభ్యర్థులుగా 18 మంది నామినేషన్లు వేసి గెలిచిన చరిత్ర తమదన్నారు. మీ తాటాకు చప్పుళ్లకు భయపడేదిలేదని తేల్చిచెప్పారు. పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు ఎండీ.ఖలీల్, పి.రాములు మాట్లాడుతూ గుమ్మనూరు రెచ్చగొట్టే వ్యాఖ్యల ఫలితంగా ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో రాజకీయ కక్షలు పెరిగే ప్రమాదముందన్నారు. టీడీపీ నేతలు తొడలు కొట్టడాలు, మీసాలు మెలేయడాలు మాని సూపర్‌సిక్స్ హామీల అమలు, అభివృద్ధిపై దృష్టి పెడితే తాము కూడా సహకరిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే వైవీఆర్ హయాంలో గుంతకల్లు నియోజకవర్గంలో కనీవినీ ఎరుగనిరీతిలో అభివృద్ధి జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ,బీసీ విభాగాల నియోజకవర్గం అధ్యక్షులు వీరేష్, రంగనాయకులు, కౌన్సిలర్ లింగన్న, కోఆప్షన్ సభ్యుడు ఫ్లయింగ్‌మాబు, రైతునాయకుడు బాబూరావు, ఎస్సీసెల్ నాయకుడు బావన్న, లాయర్ ఆరీఫ్, పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు తిమ్మప్ప, హుసేన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వివక్ష వీడి.. బిల్లులు మంజూరు చేయండి



కలెక్టరేట్‌లో డీఆర్వోకు వినతి పత్రం అందజేస్తున్న నెలగొండ సర్పంచ్ పాటిల్ భాగ్యమ్మ

గుంతకల్లు: ప్రతిపక్ష పార్టీ సర్పంచ్ (వైఎస్సార్‌సీపీ) కావడంతో తనపై కక్ష పెట్టుకుని బిల్లులు మంజూరు చేయడం లేదని నెలగొండ సర్పంచ్ పాటిల్ భాగ్యమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా గ్రామంలో నెలకొన్న సమస్యలపై సంబంధిత విభాగాల అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో డీఆర్వో మలోలకు ఆమె ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కారించుకోవడానికి పంచాయితీ తీర్మానం ద్వారా పలు అభివృద్ధి పనులకు తన సొంత డబ్బులు దాదాపు రూ.4.20 లక్షలు ఖర్చు చేశానన్నారు. ఇందులో రూ.90 వేలు ఖర్చు చేసి గ్రామంలో ఎల్‌ఈడీ లైట్లు అమర్చానన్నారు. మోటర్లు చెడిపోయి గ్రామంలో తీవ్రమైన తాగునీటి సమస్య ఏర్పడటంతో.. ఐదు మోటర్లు మరమ్మతు చేయించానన్నారు. అదేవిధంగా బస్టాండ్ సమీపంలో మంచి నీటి సంప్ మోటర్ పూర్తిగా చెడిపోవడంతో కొత్త మోటర్ ఏర్పాటు చేశామన్నారు. ఈ క్రమంలోనే గ్రామంలో శానిటేషన్ పనులు, పైప్‌లైన్ లీకేజీలు పనులు కూడా పంచాయతీ తీర్మానంతోనే చేయించానన్నారు. ఈ పనులకు సంబంధించి రూ.4.20 లక్షలు జీఎస్టీతో కలిపిన బిల్లులను, చెక్ మెజర్మెంట్‌లు, ఇతర రికార్డులు జత చేసి గ్రామ పంచాయతీ కార్యదర్శికి అందజేశానన్నారు. దాదాపు నాలుగు నెలలు కావస్తున్నా ఇంత వరకూ బిల్లులు పెట్టడం లేదన్నారు. అలాగే గ్రామంలో సలు సమస్యలున్నాయన్నారు. సమస్యలు పరిష్కారం కావాలంటే అధికార పార్టీ నాయకుల సిఫార్సు కావాలని అధికారులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించడం తోపాటు బిల్లులు మంజూరు చేయించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

‘యువత పోరు’కు మేము సైతం..

యాడికి: యువత హక్కుల కోసం పోరాడేందుకు మేము కాడా సిద్ధంగా ఉన్నామని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి, మండల కన్వీనర్ సంజీవరాయుడు, జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ యువత పోరు కార్యక్రమంలో భాగంగా అనంతపురంలోని కలెక్టరేట్ ఎదుట దగ్గర తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు సోమవారం యాడికి మండలం నుంచి రెండు వాహనాలలో నాయకులు తరలివెళ్లారు. యువత పోరుబాట ఉద్యమానికి సంఘీభావంగా వారితోపాటు కేశవ రెడ్డి, ముత్యాల రెడ్డి, శ్రీనివాస రెడ్డి, బుజ్జి, సత్య పాల్గొన్నారు.



అనంతపురం కలెక్టర్ కార్యాలయం వద్ద యువత పోరుబాటలో పాల్గొన్న యాడికి మండల నాయకులు

సమస్యలు పరిష్కరించాలి

గుత్తి: మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఎం నాయకులు, కార్యకర్తలు మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి నిర్మల మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలోని జెడ్‌పీరా రెడ్డి కాలనీలో రోడ్లు, వీధి దీపాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా తాగునీరు, రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియాకు అందజేశారు. కేవీపీఎస్ మండల అధ్యక్షుడు మల్లికార్జున, రైతు సంఘం కార్యదర్శి రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాగుభూమిని దళితులకే కేటాయించాలి

పామిడి: మండలంలోని గజరాంపల్లిలో సర్వే నెంబర్ 296 లోని 8 ఎకరాలను సాగు చేస్తున్న దళితులకే కేటాయించాలని సీపీఎం ఆధ్వర్యంలో సాగు దళిత రైతులు తహసీల్దార్ సీ షర్మిలను కోరారు. ఈ మేరకు సోమవారం గ్రీవెన్స్‌లో వారు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గత 20 ఏళ్లగా ఆ సర్వే నెంబర్‌లోని 8 ఎకరాలను 20 కుటుంబాలు 40 సెంట్ల చొప్పున సాగుచేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. వారికే ఆ భూమి దక్కేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు, పీ అనిమిరెడ్డి, కే మల్లేసు, కే చంద్రమోహన్‌రెడ్డి, ఆర్ ముత్యాలు, దళిత రైతులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి నేడు పరీక్ష

గుత్తి: మోడల్ స్కూల్లో 6, 7, 8, 9వ తరగతుల్లో ప్రవేశం కోసం మంగళవారం గుత్తి మోడల్ స్కూల్లో ఎంట్రెన్స్ పరీక్ష ఉంటుందని, హాల్ టికెట్లు రాకున్నా అప్లికేషన్ లేదా ఆధార్ కార్డు తీసుకొచ్చి పరీక్ష రాయవచ్చని ప్రిన్సిపాల్ ప్రశస్త కుమారి సూచించారు. స్థానిక మోడల్ స్కూల్లో సోమవారం ఆమె విలేఖరులతో మాట్లాడారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎంట్రెన్స్ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రవేశ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తామన్నారు.

పామిడి: పట్టణంలోని మోడల్‌స్కూల్‌లో 7, 9 తరగతుల్లో మిగిలిన ఖాళీ సీట్ల భర్తీ ప్రవేశ పరీక్షను పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ వై.అరుణ సోమవారం తెలిపారు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు.

‘ట్రాఫిక్ సమస్య పరిష్కరించండి’

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్ఎస్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. బీజేపీ మండల , పట్టణ అధ్యక్షులు చంద్రశేఖర్ రాయల్, వెంకప్ప, ప్రధాన కార్యదర్శి నూరుల్ హాసన్ బాషా, జిల్లా నాయకులు ఆదినేని రామాంజనేయులు సోమవారం పోలీసు స్టేషన్‌కు వెళ్లి సీఐ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఇందుకు సీఐ సానుకూలంగా స్పందించినట్లు బీజేపీ నాయకులు తెలిపారు.

రెవెన్యూ అధికారులకు సత్కారం

పామిడి: పామిడి తహసీల్దార్ కార్యాలయానికి ఇటీవల బదిలీపై వచ్చిన తహసీల్దార్ సీ షర్మిల, ఇతర రెవెన్యూ అధికారులను సోమవారం వివిధ రాజకీయపార్టీల నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు తహసీల్దార్‌తో పాటు డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ, ఆర్ఐ సాకే గాయత్రి, రీసర్వే డీటీ సురేఖను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

సంక్షిప్త సమాచారం

బదిలీలు పారదర్శకంగా జరగాలి

తాడిపత్రి రూరల్/యాడికి/పుట్లూరు: పట్టణ, గ్రామ సచివాలయాల్లోని సర్వేయర్ల బదిలీలు పారదర్శకంగా జరగాలని సోమవారం తహసీల్దార్ సోమశేఖర్‌కు సర్వేయర్లు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఉద్యోగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సొంత మండలాల్లో పోస్టింగ్‌లు ఇవ్వాలని, ఇతర ప్రాంతాలకు బదిలీ చేయకూడదన్నారు. తమ డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని వారు కోరారు. అలాగే తమను సొంత మండలానికే బదిలీ చేయాలంటూ యాడికి మండలంలోని గ్రామ సర్వేయర్లు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మౌలాలి, మహబూబ్‌బాషా, రాజశేఖర్‌రెడ్డి, జనార్దనరెడ్డి, కృష్ణారెడ్డి, భార్గవ్, దావూద్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పుట్లూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మహబూబ్‌బాషాకు గ్రామ సచివాలయ సర్వేయర్లు వినతి పత్రం అందించారు. సొంత మండలాల్లో బదిలీలకు అవకాశం ఇవ్వాలని, అంతర్ జిల్లా బదిలీలు ఇవ్వాలని, పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయకుంటే డీలర్ల మార్పు

తాడిపత్రి రూరల్: చౌక దుకాణాల్లో కార్డుదారులకు సరుకులు సక్రమంగా పంపిణీ చేయకపోతే డీలర్లను మార్చుతామని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక నివాసంలో సోమవారం అధికారులు, డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. రేషన్ గోడౌన్‌లో కాటాలు పనిచేయకపోవడం వల్ల తక్కువ తూకాలతో బస్తాలను స్టోర్‌లకు అధికారులు పంపుతున్నారన్న దానిపై ఎమ్మెల్యే స్పందించారు. ఈనెల లోపు కాటాలను మరమ్మతులు చేయిస్తామన్నారు. అవసరమైతే అనంతపురంలోని గోడౌన్లలో బస్తాలకు కాటా వేయించి తరలించే ఏర్పాట్లు చేస్తామన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎంపిక

పెద్దపప్పూరు: మండల కేంద్రంలో సోమవారం ఎమ్మార్పీఎస్ మండల కమిటీని ఎంపిక చేశారు. మండల ఇన్‌చార్జ్‌లుగా మారయ్య, మనోహర్, రాజు ఎంపికయ్యారు. జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదినారాయణ, నాయకులు కత్తుల కొండయ్య, పెద్దిరాజు, చిన్న గుర్రప్ప, కుమార్, దేవరాజ్ పాల్గొన్నారు.

ఉపాధి బిల్లులు మంజూరు చేయండి

శింగనమల: మండలంలో ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయంలోతహసీల్దార్ శేషారెడ్డికు సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో దాదాపు 5 వేలు మంది కూలీలు ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారన్నారు. కానీ 12 వారాలుగా బిల్లులు మంజూరు కాలేదన్నారు. కూలీలకు బిల్లులు మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, సీపీఎం నాయకులు సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పెద్దపప్పూరు: మండలంలోని చిక్కేపల్లిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేశామని పెద్దవడుగూరు సీఐ రామసుబ్బయ్య తెలిపారు. వారి నుంచి రూ.6,225 నగదుతో పాటు నాలుగు ద్విచక్రవాహనాలు, సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

గుత్తి రూరల్: మండలంలో సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం సీపీఐ నాయకులు ధర్నా చేశారు. సీపీఐ మండల కార్యదర్శి రాఘాసు, మహిళా సంఘం నియోజకవర్గ కార్యదర్శి మహముదా తదితరులు తహసీల్దార్ పుణ్యవతికి వినతి పత్రం అందజేశారు. సీపీఐ నాయకులు రాజుయాదవ్, రమేష్‌బాబు, వెంకట్రాముడు, నరశింహయ్య, నజీర్, షఫీ, డానియల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్టళ్లలో వసతి కల్పించాలి



తహసీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, తల్లులు

గుత్తి రూరల్: ప్రభుత్వ వసతి గృహాల్లో దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థినికీ వసతి కల్పించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బాలాజీ, ధను డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని గిరిజన బాలికల వసతి గృహంలో బీసీ విద్యార్థినులకు సీట్లు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. గతంలో 4 నుంచి 10వ తరగతి వరకూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థినులు గిరిజన హాస్టళ్లలో ఉంటూ చదువుకునే అవకాశం ఉండేదన్నారు. ఈ ఏడాది నుంచి బీసీ విద్యార్థినులకు సీట్లు ఇవ్వరాదని జిల్లా అధికారులు వార్డెన్లకు సమాచారం ఇచ్చారన్నారు. బీసీ విద్యార్థినులను హాస్టళ్లలో చేర్చుకోకపోవడంతో తల్లిదండ్రులు వారిని పాఠశాలలకు పంపకుండా ఇళ్లకు తీసుకెళ్తున్నారని అన్నారు. హాస్టళ్లలో బీసీ విద్యార్థినులకు వసతి కల్పించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ పుణ్యవతికి వారు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంధకారంలో ప్రభుత్వాస్పత్రి

తాడిపత్రి రూరల్: పట్టణంలోని వంద పడకల ఏరియా ఆస్పత్రిలో విద్యుత్ సౌకర్యం లేక రోగులు ఇబ్బందులు పడ్డారు. గాలుల ప్రభావం వల్ల సోమవారం రాత్రి పలు మార్లు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆస్పత్రికి జనరేటర్ సౌకర్యం లేకపోవడంతో రోగులు, వారి బంధువులు ఉక్కపోత భరించ లేక ఆరుబయటకు వచ్చి సేద తీరడం కనిపించింది. వార్డుల్లోని బాలింతలు, చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎప్పుడు కరెంట్ వస్తుందో ఎపుడు పోతుందో తెలియక ఆందోళనకు గురయ్యారు. మూడు జిల్లాల కేంద్రంగా ఉన్న ఏరియా ఆస్పత్రిలో జనరేటర్ సౌకర్యం లేక పోవడంతో పట్ల రోగులు ఆందోళన చెందుతున్నారు.



చీకట్లో ప్రభుత్వాస్పత్రి. (ఇన్‌సెట్‌లో) ఆరుబయట కూర్చొన్న రోగులు, వారి బంధువులు